రా..రమ్మని..



SUNDAY SPECIAL

మనసును మైమరపింపజేసే ప్రకృతి సౌందర్యం.. సువిశాల సాగరతీరం.. పరవళ్లు తొక్కే పచ్చదనం.. ప్రశాంతతను అందించే ఆధ్యాత్మిక సౌరభం.. చారిత్రక ఘనతను చాటి చెప్పే ఆనవాళ్లు .. కలగలిసిన సమాహారం భీమిలి తీరం. కార్తీక మాసం కావడంతో వనభోజనాలకు వచ్చేవారికి మధుర జ్ఞాపకంగా మిగిలేలా సహజ అందాలతో పాటు సందర్శనీయ ప్రాంతాలెన్నో భీమిలి పరిసరాల్లో కొలువుదీరాయి. చిన్నారుల ఆటపాటలకు అనువుగా.. పెద్దవారికి ఆహ్లాదకరంగా ఉన్న పిక్నిక్ స్పాట్లు సందర్శకులను రా.. రమ్మని స్వాగతిస్తున్నాయి.

– కొమ్మాది/భీమునిపట్నం



తొట్లకొండపై మహాబౌద్ధ స్థూపం

బౌద్ధ ఆరామాలు

భీమిలి తీర ప్రాంతాల్లో అలనాటి బౌద్ధ భిక్షువులు నడయాడిన ప్రదేశాలు తొట్లకొండ, బావి కొండ ఉన్నాయి. వీటిపై నీటి తొట్టిలు, చైత్యాలు, స్థూపాలు చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తాయి.

సీ పాయింట్ పార్కు

మంగమారిపేట తొట్లకొండపై సీ పాయింట్ పార్కు ఓ అద్భుతం. ఇక్కడి నుండి ఒంపులు తిరిగిన నీలి సంద్రం పర్యాటకులకు కనువిందు చేస్తుంది. ఇక్కడ చుట్టూ పార్కు, బెంచీలు వంటివి ఏర్పాటు చేశారు. పిక్నిక్ సీజన్‌లో కుటుంబంతో గడపడానికి ఈ పార్కు ఎంతో విశాలంగా ఉంటుంది. ఈ ప్రాంతానికి ఆటో ద్వారా లేదా 900కె బస్ ద్వారా చేరుకోవచ్చు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గం.ల వరకు ఇక్కడ ప్రవేశానికి అనుమతి ఉంటుంది. ద్విచక్రవాహనానికి రూ. 20, కారు రూ. 30, బస్సు రూ. 200, నడకమార్గానికి రూ. 5 ప్రవేశ రుసుము చెల్లించాలి. ఇక్కడ చరిత్రను తెలసుకునేందుకు గైడ్ లక్ష్మణ్‌ను 91631 75776 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ఆనందం.. ఆహ్లాదం

- విశాఖ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్లు పొడవు గల బీచ్‌రోడ్డులో ప్రయాణం చక్కని అనుభుతిని పంచుతుంది.
- గోస్తనినది సముద్రంలో కలిసే సాగరసంగమ ప్రాంతం, అక్కడ బీచ్‌పార్కు, బీచ్ పరిసరాల్లో ఉండే బొమ్మలు ఆకట్టుకుంటాయి.
- బీచ్ సమీపంలోని డచ్ సమాధులు, లైట్‌హౌస్ చారిత్రక ప్రాధాన్యం కలిగినవి.
- కొండపై పురాతన నరసింహస్వామి ఆలయం ఉంది. ఇక్కడి నుంచి గోస్తని నది సముద్రంలో కలిసే సాగరసంగమ ప్రాంతం అద్భుతంగా కనిపిస్తుంది.
- ఊరి మధ్యలో బ్రిటిష్‌వారు ఏర్పాటు చేసిన గంటస్తంభం, బీచ్ రోడ్డులోని కొబ్బరితోట పార్కు, తగరపువలస రోడ్డులోని జమ్మి చెరువు పార్కు ఆకట్టుకుంటాయి

ఇస్కాన్ మందిరం

వైజాగ్ నుండి భీమిలి మార్గ మధ్యలో సాగర్‌నగర్ వద్ద శ్రీ రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథులు కొలువైన ఇస్కాన్ మందిరం ఉంది.



సాగర్‌నగర్‌లో ఇస్కాన్ టెంపుల్

శిలా తోరణం

మంగమారిపేట బీచ్ వద్ద సహజసిద్ధంగా ఏర్పడిన అనేక ఆకృతులు గల శిలా సంపదకు ఇది ఒక స్థావరం. వీటిలో ప్రత్యేకంగా శిలా తోరణం పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఫొటో షూట్, షార్టు ఫిల్మ్స్ సీరియల్స్, సినిమాలకు ఇది ఒక ఎసెట్‌గా మారింది. ఎదురుగా వేదాలకు నిలయమైన వారిజ ఆశ్రమం ఉంది.

రామాద్రి

ఆధ్యాత్మిక ఆద్రి రామాద్రి. ఈ ప్రాంగణంలో హనుమంతుడు, శివుడు, వినాయకుడు, శ్రీరాముని ఆలయం, శ్రీ వెంకటేశ్వరుని ఆలయం, కదంబనవనవాసిని, దత్తాత్రేయుడు, శ్రీకృష్ణుడు, నవగ్రహాలు ఆలయాలు కలవు. ఇక్కడ వేలాది తులసి కోటలు, గోశాల ప్రత్యేకం.

రుషికొండ శ్రీవారి ఆలయం

రుషికొండలో టీటీడీ నిర్మించిన శ్రీవారి ఆలయం సందర్శకులకు ఆహ్లాదకర అనుభూతినిస్తుంది. ఇక్కడ కొండపై శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువుదీరారు. ఇక్కడి కొండపై నుంచి సముద్రం కనువిందు చేస్తుంది.



రామానాయుడు ఫిల్మ్ స్టూడియో

భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలో డా. డి.రామానాయుడు ఫిల్మ్ స్టూడియో ఉంది. నిత్యం ఏదో ఒక షూటింగ్ జరుగుతూ ఉండడంతో నటీనటుల సందడి ఉంటుంది. కొండపై నుండి సీవ్యూ అద్భుతంగా ఉంటుంది. షూటింగ్ కోసం బంగ్లా, షాపింగ్ కాంప్లెక్స్ ఎన్నో ఇక్కడ నిర్మించారు. రోజూ ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దర్శించవచ్చు. పెద్ద వారికి రూ.60, పిల్లలకు రూ. 30 టికెట్ ధర. స్టూడియో చేరుకునేందుకు అన్ని వాహనాలకు అనుమతి ఉంది.



సువిశాల రుషికొండ తీరం

అందాల రుషికొండ

కడలి అలల చెంత అద్భుతమైన తీరం రుషికొండ బీచ్. ప్రపంచ వ్యాప్తంగా బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా మన రాష్ట్రంలో ఒక రుషికొండకు మాత్రమే అవకాశం దక్కింది. బోటు షికారు, పచ్చదనంతో కూడిన అందమైన పార్కులు, చిల్డ్రన్ పార్కు వంటివి ఎన్నో ఈ రుషికొండ బీచ్‌కు సొంతం.



సీ పాయింట్ పార్క్




బీచ్‌రోడ్డులోని పైలాన్

అద్భుతం .. మొగదారమ్మ ఆలయం

సాగర్‌నగర్ బీచ్ రోడ్డు వద్ద శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయం మహాద్భుతం. భారతీయ సంస్కృతికి అద్దం పట్టేలా ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవచ్చు. ఆలయ ప్రాంగణంలో 12 రాశులు, 16 నృత్యకళలు, 12పుష్కర దేవతల రూపాలను శిలలపై మలచారు. దానితో పాటు త్యాగరాజు స్వామి, వటపత్ర సాయి, శ్రీకృష్ణ పరమాత్ముని రూపాలు అడుగడుగునా దర్శనమిస్తాయి. ఇక్కడ అణువణువునా శిల్ప కళ చూపరులను దృష్టి మరల్చనీయదు.




సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయం





సుందరమైన భీమిలి తీరం



గోస్తని నది సముద్రంలో కలిసే సాగరసంగమ ప్రాంతం

సీ వ్యూ పార్క్

మంగమారిపేట తొట్లకొండకు సమీపంలో సీవ్యూ పార్కు పచ్చని తివాచీలా కనువిందు చేస్తుంది. ఇక్కడ వన భోజనాలు చేసేందుకు అనువైన స్థలం. పచ్చని చెట్ల నీడ అద్భుతంగా ఉంటుంది. ప్రవేశం ఉచితం.

వారసత్వ సంపద.. ఎర్రమట్టి దిబ్బలు

ఇటు బీచ్ రోడ్డు, ఐఎన్ఎస్ కళింగ, నేరెళ్ల వలస, నిడిగట్టు, జేవీ అగ్రహారం నడుమ 1195 ఎకరాల్లో ఎర్రమట్టి దిబ్బలు విస్తరించి ఉన్నాయి. ఇందులో 295 ఎకరాలను జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అరుదైన జాతీయ వారసత్వ సంపదగా వీటిని గుర్తించింది. ఇవి 60 నుంచి 80 అడుగుల ఎత్తు వరకు కొండల వలె ఈ ఎర్రమట్టి దిబ్బలు కనిపిస్తాయి. ఈ ఎర్రమట్టి దిబ్బలు భీమిలి అందాలకు కీర్తి కిరీటం.

క్లుప్తంగా

కేజీబీవీలో ఎన్‌సీసీ యూనిట్



ఎన్‌సీసీ విద్యార్థులతో అధికారులు

పద్మనాభం: పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో శనివారం ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు చేశారు. 25 మంది విద్యార్థినులతో ఈ యూనిట్ ఏర్పాటు చేశారు. ముందుగా విద్యార్థినులకు దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించి, వారిలో 25 మందిని ఎంపిక చేసి యూనిట్‌గా ఏర్పాటు చేశారు. విజయనగరం 2 ఆంధ్రా బాలికల ఎన్‌సీసీ బెటాలియన్ మేజర్ పరమేశ్వర సింగ్, సుబేదార్ హుస్సేనయ్య, హవల్దార్ అమిత్ కుమార్ సింగ్ ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, సీఆర్టీలు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో విష్ణు సహస్ర నామ పారాయణం



విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్న భక్తులు

కొమ్మాది: బీచ్‌రోడ్డు రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో (టీటీడీ) శ్రీవారి భక్తులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ముందుగా శ్రీవారి సుప్రభాత సేవ, తోమాల సేవ అనంతరం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. శనివారం కావడంతో శ్రీవారిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం కోలాటం, నామసంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

విద్యార్థులకు షూ పంపిణీ



విద్యార్థులకు షూ అందజేస్తున్న నాయకులు

పద్మనాభం: మండలంలోని రెండు పాఠశాలలకు చెందిన 230 మంది విద్యార్థులకు ఓ వ్యాపారి షూ సమకూర్చారు. వాటిని స్థానిక నాయకులు శనివారం పంపిణీ చేశారు. ఆర్‌వీ పురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మందికి నాయకులు మరగడ అప్పారావు, ఆవాల గంగరాజు, కర్రి రమణ షూ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేటలో 30 మందికి అలబోని కృష్ణ బూట్లు పంపిణీ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: విశాఖపట్నం జిల్లా పద్మనాభ మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన రైతు నారాయణ (35) అప్పుల బాధ తాళలేక శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో విజయనగరంలోని చాకలిపేట లేఅవుట్‌లో పురుగుల మందు సేవించాడు. ఆయనను స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రేపు

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల నాల్గో తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విజయ కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరవుతారని తెలియజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు

తగరపువలస: శంకర్ ఫౌండేషన్ అనుబంధ సంస్థ బ్రాజిలా కంపెనీ, స్థానిక ఎంఎస్‌ఆర్ కల్యాణ మండపం అధినేత మజ్జి కిషోర్‌కుమార్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లోని 1100 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు తెలిపారు. శనివారం ఆయన భీమిలి మండలం అమనాంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దాకమర్రి, మజ్జివలస, మజ్జిపేట, చిప్పాడ, అమనాం పంచాయతీలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ ఉచిత సేవలు అందించామన్నారు. అవసరమైన విద్యార్థులందరికీ కళ్లద్దాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, శంకర్ ఫౌండేషన్ జీఎం రమేష్, కేవీ రమణ, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.



దాకమర్రిలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న భీమిలి ఎంపీపీ వాసురాజు

పొగాకు రహిత సమాజమే లక్ష్యం

తగరపువలస: పొగాకు రహిత సమాజం మనందరి లక్ష్యం కావాలని భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.వి.టి.రత్నం అన్నారు. పొగాకు వల్ల కలిగే అనర్థాలపై చెరకుపల్లి అవంతి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం రత్నం మాట్లాడుతూ ఏటా 7 మిలియన్ల మంది ఈ పొగాకు బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులతో పాటు కుటుంబాలను పొగాకు ఆర్థికంగా దెబ్బ తీస్తుందన్నారు. కార్యక్రమంలో అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ షరీఫ్, అధ్యాపకులు చిన్నయ్య, సంగీత మిశ్రా, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చిప్పాడ హైస్కూల్ వద్ద పొగాకుకు వ్యతిరేకంగా నినదిస్తున్న అవంతి విద్యార్థులు

బంగ్లామెట్ట పాఠశాలలో 'నో బ్యాగ్ డే'



పనికిరాని వస్తువులతో చిన్నారులు తయారు చేసిన మెటీరియల్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. ప్రతి నెలా మొదటి, మూడో శనివారాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు కాగితపు ముక్కలు, అట్టలు, చింతపిక్కలు, చీపురుపుల్లలు, ఇతర వాడిపడేసిన వస్తువులతో మోడల్స్ తయారు చేశారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక మాట్లాడుతూ విద్యార్థులలో భాషా నైపుణ్యం, సృజనాత్మక నైపుణ్యం, ఆరోగ్యం, మానసిక వికాసం పెంపొందించడానికి నో బ్యాగ్ కృత్యాలు దోహదపడతాయన్నారు. తక్కువ ఖర్చుతో బోధనాభ్యసన సామగ్రి తయారీ, పాఠ్యాంశ బోధనకు అనువైన సాధనాలు తయారు చేయవచ్చన్నారు.

కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు ఐటీ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు కాలనీలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కాలనీ, ఐటీ సెజ్ జంక్షన్ వంటి ముఖ్య ప్రాంతాల నుంచి కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న హెచ్‌టీ విద్యుత్ లైన్‌తో దెబ్బ తిన్న విద్యుత్ స్తంభం ఉండేది. కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో స్తంభం పూర్తిగా దెబ్బతిని, ప్రమాదకరంగా మారింది. దీనిపై సాక్షి దినపత్రికలో గత నెల 29వ తేదీన 'కూలేందుకు సిద్ధంగా' శీర్షికతో ప్రచురితమైన వార్తపై మధురవాడ సబ్‌స్టేషన్ ఏఈఈ శైలజ స్పందించారు. సిబ్బందితో స్తంభం మార్పు చేయించారు. కొత్త స్తంభం ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విరిగిన స్తంభం స్థానంలో ఏర్పాటు చేసిన కొత్త స్తంభం

ఇస్కాన్‌లో వైభవంగా గోవర్ధన పూజ

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో గోవర్ధన పూజా మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. గోవర్ధన పర్వతాన్ని తలపించే విధంగా అన్నరాశి, వివిధ రకాల స్వీట్లు, పలుకులు, పండ్లతో అన్నకూట్ (ఆహారపర్వతం) ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన 1008 రకాల పిండి వంటకాలు, పండ్లను స్వామి వారికి నివేదించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించారు.



అన్నకూట్ వద్ద శ్రీకృష్ణుడు

కార్తీక పూజలు ప్రారంభం



సిద్ధేశ్వర స్వామి ఆలయంలో పూజలు



గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో..

మధురవాడ: కార్తీకమాసం ప్రారంభం కావడంతో శనివారం వేకువ జాము నుంచి శివాలయాల్లో కార్తీక పూజలు ప్రారంభమయ్యాయి. మధురవాడలో సిద్ధేశ్వర స్వామి పీఠంలోని శ్రీ అన్నపూర్ణా సమేత సిద్ధేశ్వర దేవీ సహిత సిద్ధేశ్వర స్వామి ఆలయం, ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వర స్వామి ఆలయం, మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంతో పాటు ఇతర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అభిషేక ప్రియుని పంచామృతాలతో అభిషేకించి, మారేడు దళాలతో అర్చించారు. పూలు, పండ్లు నివేదించారు.

శివాలయాలకు భక్తుల తాకిడి

పద్మనాభం: కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా పద్మనాభం, తునివలస, కురపల్లి, పొట్నూరు, అనంతవరంలోని దారకొండపై వెలసిన శివాలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త పూర్ణ చంద్రరావు పూజలు చేశారు.

ఆలయ భూముల ఆక్రమణలపై చర్యలకు ఆదేశం

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది గ్రామంలోని రామాలయానికి సంబంధించిన భూ ఆక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఇక్కడ సర్వే నెంబర్ 84లో 31 సెంట్ల భూమిని ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో కాకుండా గాజువాక పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని, దేవాలయ భూములు పరిరక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

'భూ సర్వేపై దుష్ప్రచారం సరికాదు'



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ బంగారునాయుడు

తగరపువలస: గత ప్రభుత్వ హయాంలో జరిగిన జగనన్న భూ సర్వే ద్వారా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ మేలే చేశారని భీమిలి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బోని బంగారునాయుడు అన్నారు. కొందరు పనికట్టుకుని చేసిన దుష్ప్రచారం సరికాదన్నారు. భీమిలి మండలం శింగనబందలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ ఆధ్వర్యంలో రీసర్వేపై శనివారం జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. పూర్వం నుంచి వారసత్వంగా భూమి కలిగిన రైతులు రీ సర్వే కోసం రెవెన్యూ అధికారుల వద్దకు వెళితే వివాదాల పేరుతో పక్కన పెట్టేస్తున్నారన్నారు. అదే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు గంటల వ్యవధిలో పనులు చేసి పెడుతున్నారన్నారు. పంచాయతీ సర్వే నంబర్ 29లో ఎ.26.60 సెంట్లు భూములలో 10 ఎకరాలు మాత్రమే వివాదంలో ఉందన్నారు. మిగిలిన భూములలో 23 మంది రైతులను రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. సర్పంచ్ గాడు వెంకటనారాయణ మాట్లాడుతూ రీ సర్వేలో ఒకే ఎల్‌పీఎం పలువురికి ఇచ్చి ఇబ్బందుల కు గురి చేస్తున్నారన్నారు. స్వయంగా రైతులు తమ భూములను చూపిస్తున్నా అధికారులు ఎల్‌పీఎంలు మార్చడం లేదన్నారు. గ్రామసభలో సర్వే డీటీ లక్ష్మీకుమారి, సర్వేయర్ రమేష్ పాల్గొన్నారు.

సోనామసూరి పేరుతో రేషన్ బియ్యం విక్రయం

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం, చిప్పాడ, అన్నవరం, మూలకుద్దు పంచాయతీల్లో మోసగాళ్లు సోనామసూరి బియ్యం పేరుతో పలువురికి రేషన్ బియ్యం అంటగట్టిన విషయం చోటుచేసుకుంది. 26 కిలోల కేమిల్ బ్రాండ్ సంచుల్లో రేషన్ బియ్యం నింపి, నీట్‌గా ప్యాక్ చేసి శివారు పంచాయతీలలో విక్రయించారు.తాము రైతులమని, డబ్బులు అవసరమని ప్యాకెట్ రూ. 1200లకే ఇస్తున్నట్టు నమ్మబలికారు. శాంపిల్ బియ్యం చూసిన వినియోగదారులు వారి బుట్టలో పడి మోసపోయారు. పెదనాగమయ్యపాలెంలో బాధితులు దుర్గారావు,ఎల్లాజీ మాట్లాడుతూ బియ్యం సంచి తెరచి చూడకుండా కొనుగోలు చేయవద్దని కోరారు.